PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

గురువారం 08-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :128 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## విపక్ష ఎంపీల ఆందోళన..

# ఢిల్లీలో ఉద్రిక్తత

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు విపక్షాల డిమాండ్.**



మిగతాది 2లో

- ఎస్ఐఆర్ ప్రక్రియ రద్దు చేయాలని ఆందోళన.
- జంతర్ మంతర్ వద్ద విపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు.
- ప్రియాంక సహా మహిళా నేతలు నేలపై పడుకొని నిరసన.
- రాహుల్ సహా పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- రాహుల్‌ను 2 గంటల తర్వాత పోలీసులు విడుదల చేశారు.

## జీఎస్ఎంఏ బోర్డు సభ్యులతో ప్రధాని మోదీ భేటీ

**సమగ్ర, సుస్థిర అభివృద్ధికి సాంకేతికత సాధనంగా మారాలి: ప్రధాని**

- సైబర్ మోసాల నియంత్రణకు సాంకేతిక పరిష్కారాలు అవసరం



2లో

ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)--2026కు ముందు, సేవా తీర్థ్‌లో గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్స్ అసోసియేషన్ (జీఎస్ఎంఏ) బోర్డు సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. కేంద్ర సమాచార, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.మొబైల్ రంగంలోని ఆపరేటర్లు, సంస్థలు, అనుబంధ పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీయ సంస్థ జీఎస్ఎంఏ. సాంకేతికత సమగ్ర, సుస్థిర అభివృద్ధికి సాధనంగా మారాలని ప్రధాని అన్నారు. సమాజంలోని ఏ వర్గమూ వెనుకబడకుండా సాంకేతికతను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో డిజిటల్ సేవలు అందుబాటు ధరల్లో లభించేలా చూడాలని, చివరి అంచె వరకు సాంకేతికతను చేర్చి డిజిటల్ అంతరాన్ని పెరగకుండా నిరోధించాలని సూచించారు.అభివృద్ధి చెందుతున్న దేశాల పరివర్తనలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) కీలక పాత్ర పోషించగలదని ప్రధాని తెలిపారు.

### కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ..

## జీహెచ్‌హెచ్ ప్రాజెక్టుపై చర్చ



- నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ.
- జీహెచ్‌హెచ్ ప్రాజెక్టుపై చర్చ.
- జిల్లాల వారీ కార్యాచరణపై సమీక్ష.
- కేంద్ర, రాష్ట్ర వాటాలపై చర్చ.
- మోదీ, అమిత్ షాతో చంద్రబాబు భేటీ కానున్నారు.
- విశాఖ మెట్రో, బీచ్ కారిడార్‌కు అనుమతులు కోరనున్నారు.

దిల్లీ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమయ్యారు. దిల్లీలోని కర్తవ్య భవన్-1లోని ఆర్థికశాఖ కార్యాలయంలో భేటీ అయ్యారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వచ్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు (జీహెచ్‌హెచ్).. జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరువురూ చర్చించారు. ఎక్సటర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా చర్చలు జరిపారు.

మిగతాది 2లో

## సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాడతాం: సీఎం రేవంత్‌రెడ్డి



మిగతాది 2లో

- రాహుల్ ఆందోళనను అడ్డుకోవడం నిరంకుశత్వమని రేవంత్ విమర్శ.
- రాహుల్, ప్రియాంకలను కలిసేందుకు రేవంత్‌కు పోలీసుల అడ్డంకి.
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం.
- ఎస్ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్.
- ఈసీ ప్రజల ఓటు హక్కును హరిస్తోందని ఆరోపణ.
- ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ ఓట్లను టార్గెట్ చేస్తున్నారని విమర్శ.

### దసరా పండుగకు 7వేల ప్రత్యేక బస్సులు: టీజీఎస్ ఆర్టీసీ




2లో

### రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి దీక్ష



2లో

### శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. పది నిమిషాల్లో 60 వేల టికెట్ల బుకింగ్



2లో

## డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు: భట్టి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. “20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కొందరు నేతలు తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళపరుస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. అవసరాలకు తగ్గట్టు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు. విద్యుత్ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన లేదు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అలా మాట్లాడటం సరికాదు.



## మద్యం విక్రయాలతో ఖజానా నింపుకొంది మీరా? మేమా?: మంత్రి జూపల్లి

హైదరాబాద్: విమర్శలు చేసే ముందు వాస్తవం తెలుసుకునే ఓపిక హరీశ్‌రావుకు ఉండాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇటీవల హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. “శ్రీశైలం నీటిని బీర్ల ఉత్పత్తికి వినియోగిస్తామని నేను ఎక్కడా చెప్పలేదు. డిండి ప్రాజెక్టులోకి శ్రీశైలం బ్యాక్ వాటర్ తీసుకుంటే ప్రయోజనమనే చెప్పాను. ఎల్‌నినోను, మద్యం అమ్మకాలను ముడిపెట్టి రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉంది.



# సంపాదకీయం

## ఆ రాజ్యాంగ రక్షకులు ఇప్పుడేరీ?

పోలీసు రాజ్యం అంటే ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే న్యూఢిల్లీకి రండి. ప్రభుత్వ నెలవులు, అమాత్యుల నివాసాలు ఉన్న రహదారులలో తిరిగేందుకు ప్రయత్నించండి! కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసం, ఎన్నికల కమిషన్ కార్యాలయం, పార్లమెంటు, జంతర్ మంతర్ చుట్టూ కొన్ని కిలోమీటర్ల వరకు పోలీసులు బారికేడ్లను నిర్మించి అడుగడుగునా మోహరించారు. ఐడీ కార్డులు చూపిస్తే కానీ మీడియా ప్రతినిధులను సైతం పోలీసులు అనుమతించడం లేదు. వాహనాలను ఎక్కడో ఒక చోట నిలిపేసి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్లపై ప్రతి కొన్ని అడుగులకూ మైకులను ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అవి వింటే వెన్ను జలదరిస్తుంది. సైన్యంలో తిరుగుబాటును ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తే భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 160 కింద, ప్రభుత్వాధికారులు జారీ చేసే ఆదేశాలను ధిక్కరిస్తే సెక్షన్ 223 కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆ మైకుల ద్వారా హెచ్చరిస్తున్నారు. ప్రదర్శనకారులకు దూరంగా ఉండాలని, పోలీసులు తీసుకునే చర్యలకు ఆటంకం కలిగించరాదని హెచ్చరిస్తున్నారు.

కోట్లాది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగిస్తున్నారని, ఓట్ల చోరీతో బీజేపీ గెలిచేందుకు దోహదం చేస్తున్నారని ఆరోపిస్తూ గాంధీ జయంతి రోజున కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్షాలు ఆందోళనను ప్రకటించినప్పటి నుంచీ ఇదే పరిస్థితి. మంగళవారం ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు నుంచి నిర్వాచన్ సదన్ (ఎన్నికల కమిషన్ కార్యాలయం)కు తలపెట్టిన ఊరేగింపును అడ్డుకునేందుకు ఈ భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ముంబైలో సీజేపీ నిర్వహించిన ధర్నాలో పదివేలమంది పాల్గొన్నప్పటికీ అది శాంతియుతంగా ముగిసింది. అయితే ఢిల్లీలో జంతర్ మంతర్ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించి, పెద్ద ఎత్తున బలగాల్ని రప్పించడం ఒక యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. దేశ రాజధానిలో నిరసన ప్రదర్శనలకు అనుమతిస్తే అవి ఉధృతం కాకుండా అడ్డుకోవడం కష్టమని ప్రభుత్వం గ్రహించినట్లు కనిపిస్తోంది.

పరిస్థితి ఇలా తీవ్రతరమయ్యేందుకు ప్రభుత్వం అసలెందుకు కారణమవుతోంది? 2024లో మూడోసారి 240 సీట్లు మాత్రమే గెలుచుకుని అధికారంలోకి వచ్చేందుకు మిత్రపక్షాల సహాయం తీసుకోవాల్సి వచ్చినప్పటి నుంచీ మోదీ ప్రభుత్వం ఆత్మరక్షణలో పడినట్లు కనపడుతోంది. ఆ తర్వాత జరిగిన ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించిన తీరుపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తించడంలో ప్రతిపక్షాలు విజయవంతమయ్యాయి. ప్రతిపక్షాలనైతే దేశ వ్యతిరేకులని నిందించేందుకు అవకాశమున్నది. అయితే ఇప్పుడు నిరసన ప్రతిపక్షాల పరిధిని దాటిపోయింది. కాక్రోచ్ జనతా పార్టీ అవతరించిన తర్వాత లక్షల సంఖ్యలో యువజనులు ప్రతిస్పందిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు వారికి తోడుగా న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు, మాజీ ఎన్నికల కమిషనర్లు, అనేక ఇతర వర్గాలు చేరడంతో ప్రభుత్వ వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష చర్యలను నిరసిస్తూ ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సైతం అనేక అంతర్గత నోట్‌లను లిఖితపూర్వకంగా సమర్పించారన్న వార్త ఇటీవల బయటకు పొక్కడంతో పరిణామాలు మరో మలుపు తిరిగాయి. ఆటో డ్రైవర్లు, ఇతర సామాన్య వర్గాల్లో కూడా బీజేపీ ఎన్నికల విజయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'మేము బెంగాల్‌లో మమతా బెనర్జీ అరాచక పాలనపై పోరాడి విజయం సాధించాం. అయినప్పటికీ మాది నిజమైన విజయం అని చెప్పుకోలేకపోతున్నాం' అని బీజేపీ సీనియర్ నాయకుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ పరిస్థితి ఇంతదాకా రావడానికి ప్రధాన కారణం వ్యవస్థలను తన గుప్పిట్లో ఉంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించడమేనని గట్టిగా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.. ప్రత్యర్థులను తుడిచిపెట్టేందుకు ఈడీ, సీబీఐ మొదలైన దర్యాప్తు సంస్థలను ఎడా పెడా ప్రయోగించడం, తమతో చేతులు కలిపిన నేర చరితులను చట్టం నుంచి రక్షించడం, సీవీసీ, కాగ్‌లను నామమాత్ర సంస్థలుగా మార్చడం మొదలైన రాజ్యాంగ విరుద్ధ చర్యలకు ప్రస్తుత పాలకులు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. సమాచార హక్కును నీరుగార్చినప్పుడే వ్యవస్థల పనితీరుపై గౌరవం తగ్గిపోయింది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థల పనితీరు కూడా అనుమానాస్పదంగా మారాయి. గతంలో కూడా వ్యవస్థలను అధికారంలో ఉన్నవారు ఉపయోగించుకున్న ఉదంతాలు లేకపోలేదు. కానీ మోదీ హయాంలో అన్ని వ్యవస్థలను ఉపయోగించుకున్న తీరు పచ్చిగా, తెంపరితనం లేకుండా కనిపిస్తోందన్న విమర్శలూ ఎక్కువగా ఉన్నాయి. ఈ మొత్తం క్రమంలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలపై కానీ, నిర్మాణాత్మకమైన అభివృద్ధి చర్యలపై కానీ జరిగే సానుకూల చర్చ గాలికి కొట్టుకుపోతోంది. తాను అధికారంలోకి వచ్చి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ప్రకటించిన సేవా సంకల్ప్ అమలవుతున్న రోజుల్లోనే ఈ పరిణామాలు జరగడం ఒక వైరుధ్యం. 2014లో 282 సీట్లు, 2019లో 303 సీట్లు గెలుచుకుని ఎవరి అవసరమూ లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా హిందూ ఓటర్లను పెద్దఎత్తున తన వైపునకు తిప్పుకున్నప్పుడు ఎవరూ ఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టలేదు. అయితే ఆ విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో ఆయన ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలే ప్రస్తుత ఈ పరిస్థితికి కారణమని చెప్పక తప్పదు.

మన రాజ్యాంగ వ్యవస్థలలో మరి దేనికంటే ముందు న్యాయ వ్యవస్థ, మరీ ముఖ్యంగా సర్వోన్నత న్యాయస్థానం సముచిత రీతిలో స్పందించి ఉంటే ఈ పరిస్థితి ఇలా తయారయ్యేది కాదు. ఎన్నికల అక్రమాలకు పాల్పడినందుకు నాడు ఇందిరాగాంధీని ఆరేళ్ల పాటు లోక్‌సభ నుంచి బహిష్కరించిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగ్‌మోహన్ లాల్ సిన్హా లాంటి వారు కానీ, ఆమెకు పార్లమెంటులో మాట్లాడే హక్కు, ఓటు వేసే హక్కు లేకుండా చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ లాంటి వారు కానీ ఇప్పుడు లేరు. కేశవానంద భారతి తీర్పు ద్వారా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను ముట్టుకునేందుకు వీలులేదని చెప్పిన న్యాయమూర్తులు, ప్రధానమంత్రి ఎంపికను న్యాయ పరిధిలో లేకుండా చేసేందుకు రూపొందించిన 39వ రాజ్యాంగ సవరణను కొట్టివేసిన న్యాయమూర్తులు ఇప్పుడేరీ?

నిజానికి ఎన్నికల కమిషనర్ల నియామకం గత ఏడు దశాబ్దాలుగా ఏకపక్షంగా జరుగుతోందని, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సీజేఐలతో కూడిన ఉన్నతాధికార కమిటీ ద్వారా వారిని నియమించాలని 2023లో జస్టిస్ జోసెఫ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ధైర్యంగా తీర్పునిచ్చింది. అయితే ఏ ప్రభుత్వం మాత్రం ఎన్నికల కమిషనర్లపై పట్టు కోల్పోవాలనుకుంటుంది? మోదీ సర్కార్ వెన్వెంటనే పార్లమెంటులో చట్టం చేసి కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని నియమించింది. ఈ చట్టం వల్ల జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీగా నియమించేందుకు అన్ని అడ్డంకులూ తొలగిపోయాయి. విచిత్రమేమంటే తమ రాజ్యాంగ బెంచ్ ఇచ్చిన తీర్పుపై కనీసం మధ్యంతర స్టే విధించేందుకు కూడా సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అంతేకాదు సీఈసీ, ఇద్దరు కమిషనర్లపై ఎలాంటి సివిల్, క్రిమినల్ చర్యలకూ ఆస్కారం లేకుండా వారిని కాపాడేందుకు రూపొందించిన బిల్లునూ ఉన్నత న్యాయస్థానం కొట్టివేయలేదు. ఇక పెద్ద ఎత్తున ఓటర్లకు ఓటు హక్కును తొలగిస్తున్నారంటూ పలు సంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌నూ భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కొట్టివేశారు. ఓటర్ల జాబితా నిర్వహణ అంతర్గత పరిపాలన చర్య అని, దానిపై కోర్టు జోక్యం చేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ఆ తర్వాతే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా ఓటర్ల తొలగింపు కార్యక్రమాన్ని విస్తృతం చేశారు. సుప్రీంకోర్టు కాగితంపై ఆదేశాలు జారీ చేసినప్పటికీ బెంగాల్‌లో ఎన్నికల ముందు ఓటర్లకు న్యాయం జరగలేదు. 27 లక్షలమందికి పైగా ఓటర్ల తొలగింపు జరిగితే వారిలో 22 లక్షల మంది 19 ట్రిబ్యునళ్లకు అప్పీళ్లు దాఖలు చేసుకున్నారు. వీటిపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా 16.10 లక్షల కౌంటర్ అప్పీళ్లు దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మెతక వైఖరితో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించే ప్రమాదం తలెత్తింది. పైగా కొందరు యువకులు ఎలాంటి పనీ పాటల్లేకుండా బొద్దింకల్లాగా మారారని, మీడియాలోనూ, సోషల్ మీడియాలోను చేరి అందరిపై దాడులు చేయడం వారికి అలవాటు అయిందని జస్టిస్ సూర్యకాంత్ అలవోకగా చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఈ వ్యాఖ్యలే బొద్దింకల పార్టీ ఏర్పాటుకు, యువత వారికి భారీ మద్దతునిచ్చేందుకు దారితీశాయి. తొలుత విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారకులైన వారు ఇప్పుడు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాలతో గొంతు కలుపుతున్నారు. ఇప్పుడు రోజురోజుకూ నిరసన తెలిపే వర్గాల సంఖ్య పెరిగిపోతోంది. 'రిక్షా తొక్కేవాడికైనా, కోటీశ్వరుడికైనా ఓటు హక్కు సమానమే. దాన్ని తొలగించే హక్కు ఎవరికీ లేదు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్వల్ భుయాన్ వ్యాఖ్యానిస్తే, ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఓటు హక్కు ప్రమాదంలో పడిందని మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ నారీమన్ వ్యాఖ్యానించారు. న్యాయమూర్తుల వ్యాఖ్యలు,

## దసరా పండుగకు 7వేల ప్రత్యేక బస్సులు: టీజీఎస్ ఆర్టీసీ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (౧+ూ=ుజ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగ సందర్భంగా 7వేల ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది.

కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు.. (రీజియన్ల వారీగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678)

హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు.. (మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440)

గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది.

ప్రధానంగా ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం.

ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు

దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం టికెట్ ధరలను సవరించిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం

## రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి దీక్ష

మొదటిపేజీ తరువాయి

సంగారెడ్డి: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా సంగారెడ్డి లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జగ్గారెడ్డి, నిర్మల సంఘీభావ దీక్ష చేపట్టారు. బుధవారం రాత్రి 10 గంటల నుంచి దీక్ష ప్రారంభించారు. "దేశ ప్రజల ఓటు హక్కు కోసం రాహుల్ గాంధీ యుద్ధం చేస్తున్నారు. ఆయన పోరాటం కొనసాగినంత కాలం మా దీక్ష కొనసాగుతుంది. ఎన్నికల కమిషన్ సహకారంతోనే భాజపా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఈ అంశంపై రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ రాజకీయ పోరాటం కాదు. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడే రాజకీయ యుద్ధం. త్యాగాల చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ ఇప్పుడు దేశ ప్రజల ఓటు హక్కు కోసం పోరాడుతున్నారు. ఆయన పోరాటానికి ప్రజలంతా స్వచ్ఛందంగా మద్దతుగా నిలవాలి" అని జగ్గారెడ్డి అన్నారు.

## శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు.. పది నిమిషాల్లో 60 వేల టికెట్ల బుకింగ్

మొదటిపేజీ తరువాయి

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 12, 13, 14, 18, 19, 20 తేదీలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. బుధవారం ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల చేసింది. రోజుకు పదివేల చొప్పున మొత్తం 60 వేల టికెట్లు విడుదల చేయగా.. అవన్నీ కేవలం పది నిమిషాల్లో ఖాళీ అయ్యాయి. తితిదే వెబ్‌సైట్, యాప్‌లో ఆర్కిటెక్చర్ ఛేంజ్, అప్లికేషన్ అప్డేట్ చేయడంతో ఎలాంటి అవాంతరాలు లేకుండా భక్తులు టికెట్లు బుక్ చేసుకున్నారు. లక్షల మంది భక్తులు టికెట్ల కోసం యత్నించగా.. తితిదే ఐటీ విభాగం సమర్థంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది.

## మద్యం విక్రయాలతో ఖజానా నింపుకొంది మీరా? మేమా?: మంత్రి జూపల్లి

మొదటిపేజీ తరువాయి

బీఆర్‌ఎస్ హయాంలోనే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరిగాయి. వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శించడం సరికాదు. మద్యం విక్రయాలతో ఖజానా నింపుకొంది మీరా? మేమా? నేను లెక్కలతో సహా చెబుతున్నా.. సమాధానం చెబుతారా?" అని జూపల్లి ప్రశ్నించారు

## తాళ్లపూడిలో పెద్దపులి సంచారం.. అప్రమత్తమైన అధికారులు




తాళ్లపూడి: తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలో పెద్దపులి సంచరిస్తుందనే సమాచారంతో బుధవారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు తాళ్లపూడి మండలం తుపాకులగూడెం, రాగోలపల్లి, గోపాలపురం మండలం గోపవరం తదితర కొండ, పంటపొలాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిసింది. దీంతో తెల్లవారు జామునే పంటపొలాలకు వెళ్లే రైతులు, కూలీలను అటువైపునకు వెళ్లొద్దంటూ దప్పు చాటింపు వేయించారు. దీంతో ప్రజలంతా భయాందోళనకు గురయ్యారు. పెద్దపులి కదలికలపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం రెండు డీఏలు మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2024 జనవరి, జులై డీఏలను ప్రభుత్వం విడుదల చేసింది. రెండు డీఏలు కలిపి 6.27 శాతం పెరుగుదల ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అక్టోబర్ వేతనంతో కలిపి పెరిగిన డీఏలను చెల్లించనున్నారు. డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమవుతాయి. సీపీఎస్ ఉద్యోగులకు మొదటి డీఏ 33, రెండో డీఏ 27 వాయిదాలలో చెల్లించనున్నారు.

## విపక్ష ఎంపీల ఆందోళన..

# దిల్లీలో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల నేతలు చేపట్టిన ఆందోళనలతో దిల్లీ మరోసారి అట్టుడికింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు సహా విపక్ష ఎంపీలు తన నిరసన తెలిపేందుకు జంతర్ మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆంక్షల నేపథ్యంలో వీరందర్నీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ప్రియాంకా గాంధీ సహా పలువురు మహిళా నేతలు, కార్యకర్తలు నేలపైనే పడుకొని నిరసన తెలిపారు. దీంతో జంతర్‌మంతర్ సమీపంలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు బరఖాంబ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసన ప్రదేశం నుంచి రాహుల్‌ను బలవంతంగా తీసుకెళ్లి పోలీసులు బస్సులో ఎక్కించారు. ప్రియాంకా గాంధీని ఛత్రసాల పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంలో దిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా?" అని ప్రశ్నించారు.

మరోవైపు రాహుల్ గాంధీకి సంఘీభావం తెలిపేందుకు బరఖాంబ పీఎస్ వద్దకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళం ముఖ్యమంత్రి సతీశన్‌లను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి కాంగ్రెస్ నేతలు భారీగా చేరుకొని ఆందోళన చేపట్టగా వారిని పోలీసులు నిలువరించారు. దాదాపు రెండు గంటలపాటు రాహుల్‌ను పీఎస్‌లో ఉంచిన అనంతరం విడుదల చేశారు.

## సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాడతాం: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిల్లీలో ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం మోదీ, అమిత్ షా.. నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అరెస్ట్ అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్, ప్రియాంకను కలిసేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల చర్యను రేవంత్ తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. "సర్‌ను తక్షణమే నిలిపివేయాలి. ప్రజల ఓటు హక్కును ఈసీ హరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ ఓట్ల టార్గెట్‌గా కుట్ర జరుగుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాడతాం. ఎన్నికల్లో గెలవడానికి ఈడీ, సీబీఐని వాడేవారు. ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

## జీఎస్‌ఎంఏ బోర్డు సభ్యులతో ప్రధాని మోదీ భేటీ

మొదటిపేజీ తరువాయి

పలువురు ప్రపంచ నాయకులతో జరిగిన చర్చల్లో డీపీఐ ప్రాధాన్యం వెల్లడైందని, గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధికి ఈ వేదికలు దోహదపడతాయని అన్నారు. డిజిటల్, సైబర్ మోసాల పెరుగుతున్న ముప్పును ఎదుర్కొనేందుకు సాంకేతిక ఆధారిత పరిష్కారాలు అవసరమని ప్రధాని పేర్కొన్నారు. మోసపూరిత కాల్స్‌పై ప్రజలను అప్రమత్తం చేసే అవగాహన సందేశాలను నిరంతరం పంపాలని సూచించారు. డీప్‌ఫేక్‌లు, కృత్రిమ మేధతో రూపొందించిన కంటెంట్ మూలాన్ని వినియోగదారులు వెంటనే గుర్తించే విధానాలపై పరిశీలన జరగాలని, కొత్త సాంకేతికతలకు ప్రపంచవ్యాప్త ప్రమాణాలు, ఉమ్మడి నియమాలు రూపొందించాలని అన్నారు. భారత్ డిజిటల్ పరివర్తనకు జీఎస్‌ఎంఏ సభ్యుల ప్రశంసలుడిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ రంగాల్లో భారత్ ప్రపంచ నాయకత్వ స్థానానికి ఎదుగుతోందని జీఎస్‌ఎంఏ బోర్డు సభ్యులు పేర్కొన్నారు. 4జీ, 5జీ సేవల వేగవంతమైన విస్తరణ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్థాయి, టెలికాం, మొబైల్ తయారీ రంగాల పురోగతిని వారు అభినందించారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను ప్రశంసిస్తూ, డిజిటల్ రంగం మరింత అభివృద్ధి చెందేందుకు సురక్షితమైన, స్థిరమైన, విశ్వసనీయ డిజిటల్ మౌలిక సదుపాయాలు అవసరమని తెలిపారు. 5జీ, 6జీ, కృత్రిమ మేధ, సైబర్ భద్రత, డిజిటల్ సమ్మిళితత్వం, ఉపగ్రహ కనెక్టివిటీ రంగాల్లో భారత్‌తో అంతర్జాతీయ సహకారానికి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ పదో సంచికకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. తదుపరి తరం కనెక్టివిటీ, డిజిటల్ సాంకేతికతలపై భారత్ అంతర్జాతీయ భాగస్వామ్యాలను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముందుండి బలోపేతం చేస్తున్నారు. 2026లో బార్సిలోనాలో జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన ఆయన, కనెక్టివిటీని అందుబాటు ధరల్లో, సమ్మిళితంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంపై జీఎస్‌ఎంఏ మంత్రుల కార్యక్రమంలో ప్రసంగించారు. తదుపరి తరం కనెక్టివిటీ, 6జీ, సురక్షిత డిజిటల్ మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధ, ప్రపంచవ్యాప్తంగా పరస్పర అనుసంధానానికి వీలైన సాంకేతిక ప్రమాణాల రూపకల్పనపై అంతర్జాతీయ చర్చల్లో భారత్ పాత్ర పెరుగుతోందని ఈ సమావేశం వెల్లడించింది. ప్రపంచ మొబైల్ రంగంతో భారత్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు జీఎస్‌ఎంఏ బోర్డుతో జరిగిన భేటీ దోహదపడనుంది.

## కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ.. జీహెచ్‌హెచ్ ప్రాజెక్టుపై చర్చ

మొదటిపేజీ తరువాయి

ఈ భేటీలో తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

గురువారం.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతోనూ చంద్రబాబు భేటీ కానున్నారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుతో పాటు, బీచ్ కారిడార్ ప్రాజెక్టులను మంజూరు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేయనున్నారు. నదుల అనుసంధానం చేపట్టేందుకు అధ్యయనం చేయించాలని కోరనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మోదీ, అమిత్ షాను సీఎం కోరనున్నారు.

## డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు: భట్టి

మొదటిపేజీ తరువాయి

విద్యుత్ సిబ్బందిని కించపరిచే విధంగా రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఊహించుకుని మాట్లాడటం వల్ల రాష్ట్రానికే నష్టం. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ పాపం ఎవరిది? ఒక పవర్ ప్లాంట్ పెట్టేముందు.. అవసరమైన కోల్ చూసుకుని పెడతారు. సింగరేణి నుంచి యాదాద్రికి గ్రేడ్ 9 కోల్ సప్లయ్ చేస్తామని చెప్పారు. బొగ్గు సరఫరాకు ఒప్పందం చేసుకుని సప్లయ్ చేయలేదు. మొదటి నుంచి కోల్ అలాట్‌మెంట్ లేకుండానే యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టారు" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# యువ సంచలనం ఒగ్గు సతీష్‌కు రెండు కీలక బాధ్యతలు

**మునిపల్లి, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం చిన్నచెల్మెడ గ్రామానికి చెందిన యువ పారిశ్రామికవేత్త, ప్రతిభావంతుడు ఒగ్గు సతీష్ తన ప్రతిభ, పట్టుదలతో ప్రత్యేక గుర్తింపు సాధిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకవైపు యువ వ్యాపారవేత్తగా 'వి-డిజైన్స్' (ఎ-ణవంఅస్త్రఅం) గ్రాఫిక్స్ సంస్థను స్థాపించి క్రియేటివ్, డిజైనింగ్ రంగంలో ముందుకు సాగుతూనే, మరోవైపు ప్రజాసేవలోనూ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఎలాంటి వ్యాపార నేపథ్యం లేకుండా తన సొంత ప్రతిభ, కష్టపడే తత్వంతో వి-డిజైన్స్ సంస్థను అభివృద్ధి చేస్తూ స్థానిక యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. డిజైనింగ్, క్రియేటివ్ రంగంలో వినూత్న సేవలు అందిస్తూ తక్కువ కాలంలోనే కస్టమర్ల ఆదరణ పొందిన సతీష్, స్థానిక సంస్థల అభివృద్ధి, ప్రజాప్రతినిధుల సంక్షేమంపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయన సామర్థ్యం, నాయకత్వ పటిమ, సామాజిక స్పృహను



గుర్తించిన సంగారెడ్డి జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం సతీష్‌ను జిల్లా మీడియా ప్రతినిధిగా అధికారికంగా నియమించింది. ఉపసర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారి హక్కుల సాధన కోసం కృషి చేయడం, ఫోరం కార్యక్రమాలను ప్రజలకు మరియు మీడియాకు చేరవేయడంలో ఆయన కీలకపాత్ర పోషించనున్నారు. వ్యాపార రంగంలో రాణిస్తూ ప్రజాప్రతినిధుల తరపున



బాధ్యతను స్వీకరించిన ఒగ్గు సతీష్‌ను పలువురు రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, గ్రామస్థులు, శ్రేయోభిలాషులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ సమాజానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఒగ్గు సతీష్ తన ప్రస్థానంతో నిరూపిస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

# ఆగండి.. ఆలోచించండి.. అడుగు వేయండి

**- అత్యాశే సైబర్ నేరగాడి ప్రధాన ఆయుధం**




**మెదక్, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపితే అది సైబర్ మోసానికి సంకేతమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ హెచ్చరించారు. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ (వీనా) ఆదేశాల మేరకు అక్టోబర్ 2026 నెలను నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (ం+జూదీ) సూచనల మేరకు మెదక్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లను ఎస్పీ విడుదల చేశారు. గుర్తుతెలియని కాల్స్, మెసేజ్‌లు, లింకులు, అనుమానాస్పద ఆఫర్లకు స్పందించవద్దని సూచించారు. పార్ట్‌టైమ్ జాబ్, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడులు, అధికారుల పేరుతో జరిగే ఇంపర్సనేషన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేయడంతో పాటు షఎవవతీషతీఆఎవ.ప్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అక్టోబర్ నెలంతా పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, ప్రజలు అధికంగా గుమికూడే ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్, ఆర్ఐ శైలేందర్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు గుడ్ న్యూస్ శివంపేట FPO తో లాభాల బాట!

**సంగారెడ్డి జిల్లా సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 8**
శివంపేట సొసైటీ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫీూా) దూసుకుపోతోంది మిగిలిన రైతులు సద్వినియోగం. చేసుకోవాలని ఎం దామోదర్ తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫీూా) గుర్తింపును శివంపేట సొసైటీ సాధించింది. ఈ నేపథ్యంలో సొసైటీ పరిధిలోని రైతు సభ్యులందరూ ఫీూాలో విధిగా సభ్యత్వం పొందాలని సొసైటీ వర్గాలు కోరుతున్నాయి. ఇప్పటివరకు సొసైటీలోని మొత్తం 750 మంది రైతు సభ్యులకు గాను, 400 మంది రైతులు విజయవంతంగా సభ్యత్వం పూర్తి చేసుకున్నారు. మిగిలిన 350 మంది రైతులు కూడా ఆలస్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఫీూా సభ్యత్వం వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలు: భూసార పరీక్షలు: నేల స్వభావాన్ని బట్టి పోషకాల స్థాయిని తెలుసుకుని, పంటకు సరిపడా ఎరువులను మోతాదులో వాడుకునే అవకాశం. నాణ్యమైన ఇన్‌పుట్స్: ఎరువులు, విత్తనాలు మరియు ఆధునిక వ్యవసాయ పరికరాలను సులభంగా పొందవచ్చు. ధాన్యం కొనుగోళ్లలో ప్రాధాన్యత: వరి ధాన్యం విక్రయ సమయంలో ఫీూా సభ్యులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించబడుతుంది. లాభాల్లో వాటా: రైతులు చెల్లించే షేర్ ఝుజూఞ్ఖుశ్రీ ద్వారా భవిష్యత్తులో ఫీూా నిర్వహించే వ్యాపార కార్యకలాపాల లాభాలలో సభ్యులకు అర్హత మేరకు వాటా లభిస్తుంది.

**సభ్యత్వం ప్రభుత్వ రాయితీ వివరాలు:**
జీవితకాల సభ్యత్వం: ఈ సభ్యత్వ రుసుము జీవితంలో ఒక్కసారి మాత్రమే రూ. 2,000/- చెల్లించాలి. ప్రభుత్వ తోడ్పాటు: రైతు చెల్లించే రూ. 2,000/-కి అదనంగా ప్రభుత్వం మరో రూ. 2,000/- జమ చేస్తుంది. మొత్తంగా రూ. 4,000/- విలువైన షేర్ రైతు పేరుపై నమోదు చేయబడి, అధికారిక షేర్ సర్టిఫికెట్ అందజేయబడుతుంది.

**సభ్యత్వం కోసం కావలసిన పత్రాలు:**
రూ. 2,000/- సభ్యత్వ రుసుము నగదు
పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీ



ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ
పాస్‌పోర్ట్ సైజు ఫోటో
ముఖ్య గమనిక: భవిష్యత్తులో ఫీూా ద్వారా అందే లాభాలు మరియు ప్రభుత్వ రాయితీలను కోల్పోకుండా, మిగిలిన రైతులందరూ వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని సొసైటీ ప్రతినిధులు కోరారు.

# పీఎం కిసాన్ 24వ విడతపై రైతుల్లో ఆసక్తి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (ూవీ-ఖ×ూాూచీ) పథకం 24వ విడత నిధుల కోసం దేశవ్యాప్తంగా రైతులు ఎదురుచూస్తున్నారు. పీఎం కిసాన్ పథకం కింద అర్హత కలిగిన రైతు కుటుంబాలకు ఏడాదికి రూ.6,000 చొప్పున మూడు సమాన విడతల్లో, ఒక్కో విడతకు రూ.2,000 చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేస్తారు. అధికారికూవీ-ఖ×ూాూచీ పోర్టల్ ప్రకారం 23వ విడత నిధులను 2026 జూన్ 20న విడుదల చేశారు. నాలుగు నెలల వ్యవధిని దృష్టిలో ఉంచుకుని 24వ విడత అక్టోబర్‌లో విడుదల కావచ్చనే అంచనాలు, వార్తలు ప్రచారంలో ఉన్నప్పటికీ అక్టోబర్ 20న దసరా సందర్భంగా నిధులు జమ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. కాబట్టి రైతులు సోషల్ మీడియా, ఇతర అనధికారిక ప్రచారాలపై ఆధారపడకుండా కేంద్ర వ్యవసాయ శాఖ,ూవీ-ఖ×ూాూచీ అధికారిక పోర్టల్‌లో వెలువడే ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచిస్తున్నారు. పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుతం ఏడాదికి రూ.6,000ను మూడు విడతల్లో అందిస్తున్నారు. అర్హత కలిగిన రైతులు తమ పేమెంట్ స్టేటస్, బ్యాంకు వివరాలు, ఈ-కేవైసీ తదితర అంశాలను అధికారిక ూవీ-ఖ×ూాూచీ పోర్టల్‌లోని 'Know Your Statusµ ద్వారా పరిశీలించుకోవచ్చు.

# పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి




**మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పిలుపు**

**మధిర, అక్టోబర్ 07 (సందేశం టైమ్స్):**
పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పిలుపునిచ్చారు. మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ప్రతి గ్రామం, పట్టణంలో ఉన్న పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించే విధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లబోతు వెంకటేశ్వరరావు, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చావా వేణుబాబు, సర్పంచ్ కంచం గోపి, కౌన్సిలర్ వై.వి. అప్పారావు, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆళ్ల నాగబాబు, వంకాయలపాటి నాగేశ్వరరావు, భువనగిరి నారాయణ, వేల్పుల శివ, ముత్తవరపు ప్యారి, పరిష శ్రీనివాసరావు, చీదిరాళ్ల రాంబాబు, పల్లపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు

సంగారెడ్డి, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా



గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించే పీసీపీఎన్డీటీ (ఖాజాబీజు) చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, రికార్డుల నిర్వహణ, చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై సమీక్షించారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ సమయంలో అన్ని నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, అర్హతలు, అవసరమైన అనుమతులు కలిగి నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. ఏ స్కానింగ్ కేంద్రంలోనైనా గర్భిణీలకు నిర్వహించే స్కానింగ్ ద్వారా పుట్టబోయే శిశువు ఆడా, మగా అనే లింగ నిర్ధారణ చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడినట్లు గుర్తిస్తే పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే స్కానింగ్ కేంద్రాల అనుమతులను రద్దు చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో సీజ్ చేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో స్కానింగ్‌కు సంబంధించిన రికార్డులు, రిపోర్టులు, రిజిస్టర్లు తదితరాలను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను ప్రోత్సహించే వారితో పాటు వాటికి సహకరించే వారు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులేనని తెలిపారు. పీసీపీఎన్డీటీ చట్టంలోని నిబంధనలు, లింగ నిర్ధారణ పరీక్షల వల్ల కలిగే అనర్థాలు, భ్రూణ హత్యల నివారణపై జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని, ముఖ్యంగా గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షల నివారణ, పీసీపీఎన్డీటీ చట్టం సమర్థవంతమైన అమలుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ లలితాదేవి, డీసీహెచ్ఎస్ శ్రీధర్ కుమార్, జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మీ శైలజ, డాక్టర్ శశికల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అడ్వకేట్ శైలజ, డాక్టర్ రాజు గౌడ్, సంబంధిత వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులు ప్రారంభించి ఏటిగడ్డ సంఘం, పరిసర గ్రామాల ప్రజలను ఆదుకోవాలి

- శంకుస్థాపన జరిగి ఏడాదిన్నరైనా ప్రారంభంకాని రోడ్డు పనులు

ఆత్మకూరు, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి):





ఆత్మకూరు నుంచి ఏటిగడ్డ సంఘం మీదుగా సింగూరు ప్రాజెక్టు వరకు ఉన్న ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి, మంజూరైన రోడ్డు పనులను ప్రారంభించాలని ఏటిగడ్డ సంఘం గ్రామ ఉపసర్పంచ్ మడుపతి శంభు ప్రసాద్, వార్డు సభ్యులు ఎడ్ల మౌనిక వీరన్న, ఎర్రోళ్ల గంగారం, గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. గత ఐదారు సంవత్సరాలుగా రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించినప్పటికీ, అనంతరం ప్రభుత్వం మారడంతో పాత మంజూరును రద్దు చేసి కొత్తగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. 2025 మే 13న జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఏటిగడ్డ సంఘం, మాలపాడు, బుసరెడ్డిపల్లి, బొబ్బిలిగామ, సింగూర్ పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు అత్యవసర పనుల కోసం సమీప పట్టణాలకు, ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చినప్పుడు రహదారి పరిస్థితి కారణంగా సకాలంలో చేరుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల కారణంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, రోడ్డు పరిస్థితి బాగోలేక ఆర్టీసీ బస్సులు కూడా గ్రామాలకు సక్రమంగా రావడం లేదని తెలిపారు. ఏటిగడ్డ సంఘం సమీపంలోని మంజీరా నది ఒడ్డున ఉన్న శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, అలాగే సింగూర్ ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులు సైతం ఇదే రహదారిని వినియోగిస్తారని చెప్పారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో భక్తులు, సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు సమస్యపై పలుమార్లు అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి మంజూరైన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏటిగడ్డ సంఘం గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు కోరారు.

# హత్నూర శివారులో కంకర క్వారీ బీభత్సం

- రాళ్ల వర్షం.. బోర్లలో నీరు మాయం.. రైతుల ఆందోళన

హత్నూర, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ - వి. రాజు):





హత్నూర శివారులోని కంకర క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ జరుగుతోందని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పచ్చని వరి పొలాలకు సమీపంలో బ్లాస్టింగ్ చేయడంతో భారీగా దుమ్ము లేవడంతో పాటు రాళ్లు పొలాల్లోకి దూసుకొస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ సమయంలో ఏర్పడుతున్న తీవ్ర ప్రకంపనల కారణంగా చుట్టుపక్కల బోర్లలో మట్టి కూరుకుపోయి నీటి సరఫరా తగ్గిపోయిందని, లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్న బోర్లు దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. క్వారీని లోతుగా తవ్వడం వల్ల భూగర్భ జలాలు క్వారీ గుంతలోనే చేరుతున్నాయని, దీంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పడిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ సమయంలో ఎగిరి వచ్చే పెద్ద రాళ్లు పొలాల్లో పడటంతో పంటలకు నష్టం వాటిల్లడంతో పాటు ఇళ్లలో తీవ్ర ప్రకంపనలు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. క్వారీలో ఉపయోగించే పేలుడు పదార్థాల వల్ల వెలువడే పొగ, దుమ్ము పంటలు, గడ్డి తదితరాలపై పడటంతో పశువులకు మేత కలుషితమవుతోందని, దానిని తినడంతో మూగజీవాలు, గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ సమయాల విషయంలోనూ నిబంధనలు పాటించడం లేదని, రైతులు, పశువులు పొలాల్లో ఉండే సమయంలో మధ్యాహ్నం సమయంలోనే బ్లాస్టింగ్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. క్వారీ నిర్వాహకులకు పలుమార్లు సమస్యను వివరించినప్పటికీ స్పందన లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌తో పాటు సంబంధిత మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు వెంటనే స్పందించి క్వారీలో జరుగుతున్న బ్లాస్టింగ్‌పై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# హత్నూరలో వరి రైతుల నీటి కష్టాలు.. 24 గంటల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్

హత్నూర, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి):





సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నర్సాపూర్, హత్నూర శివారు ప్రాంతాల్లో వరి రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వర్షాలు లేకపోవడంతో పాటు బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడం, సాగుకు సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులు సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న కుంటల నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసుకుని, ట్యాంకర్ల సహాయంతో నీటిని పొలాలకు తరలిస్తున్నారు. నర్సాపూర్ శివారులో ఓ ట్యాంకర్ ద్వారా కుంట నుంచి పైపులు ఏర్పాటు చేసి వరి పొలానికి నీటిని అందిస్తున్న దృశ్యం రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు అద్దం పడుతోంది. ప్రస్తుతం వరి పంట చివరి దశలో ఉండటంతో నీటి ఎద్దడి కారణంగా చేతికి వచ్చిన పంట చేజారిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించడంతో పాటు బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు నిరంతరం 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకపోతే ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై అసత్య ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

మెదక్, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి):





మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియా వేదికల ద్వారా, ముఖ్యంగా ఓ యూట్యూబ్ ఛానల్‌లో అసత్య, నిరాధార, వాస్తవాలకు విరుద్ధమైన వార్తలు, ఆరోపణలు ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా, అనవసరమైన అపోహలు, గందరగోళం కలిగించే విధంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రసారం చేస్తున్న వీడియోలు, పోస్టుల వాస్తవికతపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్పీని కోరారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న వ్యక్తులు, సంబంధిత యూట్యూబ్ ఛానళ్లపై చట్టపరంగా విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే సోషల్ మీడియా వేదికలపై జరుగుతున్న ఇటువంటి ప్రచారంపై నిఘా ఉంచి, ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్--టీడబ్ల్యుయూ కూటమిని గెలిపించండి

సంగారెడ్డి, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



ఆర్టీసీ ఎన్నికల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్--టీడబ్ల్యుయూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సంగారెడ్డి ఆర్టీసీ బస్సు డిపోలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు, కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంత కిషన్, కూన సంతోష్, ఆర్టీసీ యూనియన్ నాయకులు ఎం.ఆర్.కె. రావు, కృష్ణారెడ్డి, తుల్జయ్య, పిరయ్య, నారాయణ, ఇక్బాల్ పాషా, వెంకటేష్ తదితరులు డిపోల్లోని ఆర్టీసీ కార్మికులను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ సంక్షేమం కోసం ఎస్‌డబ్ల్యూఎఫ్--టీడబ్ల్యుయూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- ప్రమాద మరణాలను తగ్గించేలా సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి: డీజీపీ సీవీ ఆనంద్



సంగారెడ్డి, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టి, ప్రమాదాల కారణంగా సంభవించే మరణాలను తగ్గించాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబరితి అధికారులను సూచించారు. రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ సమీక్ష నేపథ్యంలో బుధవారం వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా సమగ్ర రోడ్డు భద్రతా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణ వైద్య సేవలు అందేలా పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, 108 సేవల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జిల్లా వారీగా చేపట్టిన చర్యలు, వాటి పురోగతి, తదుపరి కార్యాచరణతో కూడిన నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టరేట్ వీడీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, డీఎంహెచ్‌ఓ, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన చింతకాని సర్పంచ్

- 108 అంబులెన్స్ సౌకర్యం, 30 పడకల ఆసుపత్రిగా వైద్య కేంద్రం అప్‌గ్రేడ్ చేయాలని వినతి




చింతకాని, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చింతకాని మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న వైద్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర్ టీఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చింతకాని మండలంలో 108 అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు, పాము కాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల మండల పరిధిలో పలువురు పాము కాటుకు గురైన ఘటనలను ప్రస్తావిస్తూ, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఓ రైతు పాము కాటుతో మృతి చెందిన విషయాన్ని తెలిపారు. అలాగే గర్భిణీ స్త్రీలు వైద్య సేవల కోసం మండల వైద్య ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి అవసరమైన సందర్భాల్లో ఖమ్మం ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజల అత్యవసర వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని చింతకాని మండలానికి ప్రత్యేకంగా 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ కోరారు. ప్రస్తుతం ఉన్న మండల వైద్య ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

# మైనర్ బాలిక అంగీకారం చట్టబద్ధ సమ్మతి కాదు

మెదక్, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రేమ పేరుతో మైనర్ బాలికను మాయమాటలతో నమ్మించి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు నీలం కుమార్ (30)కు ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. శంకరంపేట ఆర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన 16 ఏళ్ల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిని నిందితుడు ప్రేమిస్తున్నానని, ఎలాగైనా పెళ్లి చేసుకుంటానని నమ్మించి సంగారెడ్డిలోని తన స్నేహితుడి గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం నందికందిలో ఇంటి యజమానికి తాము భార్యాభర్తలమని చెప్పి గదిని అద్దెకు తీసుకున్నారు. కొంతకాలం తర్వాత డబ్బులు అయిపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకున్నప్పటికీ, కుటుంబ సభ్యులు కొడతారనే భయంతో పోలీసులను ఆశ్రయించాలని భావించారు. ఈ క్రమంలో శంకరంపేట గ్రామ పరిధిలో రోడ్డుపక్కన బాలిక, నిందితుడు ఉండటాన్ని గమనించిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు.




బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి శంకరంపేట ఆర్ ఎస్ఐ గౌస్ ఏప్రిల్ 2021లో కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ డీఎస్పీ కిరణ్‌కుమార్ కేసును దర్యాప్తు చేసి కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. అనంతరం కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, ప్రస్తుత శంకరంపేట ఎస్ఐ శివానందం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు నీలం కుమార్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. 18 ఏళ్లలోపు బాలిక అంగీకారం చట్టపరమైన సమ్మతిగా పరిగణించబడదని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ స్పష్టం చేశారు. ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్లను మాయమాటలతో నమ్మించి లైంగిక దాడులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల స్నేహాలు, కదలికలు, ఆన్‌లైన్ పరిచయాలపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. అనుమానాస్పద పరిణామాలను నిర్లక్ష్యం చేయవద్దని, బాలికలు, మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ శ్రీధర్‌గౌడ్, లీగల్ అడ్వైజర్ శ్వేత సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ అభినందించారు.

# దుర్గామాత పండాళ్ల ఏర్పాటుకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

- నర్సాపూర్ పోలీసుల సూచనలు

మెదక్, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు, నర్సాపూర్ పట్టణంలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి పండాళ్లు ఏర్పాటు చేయబోయే నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తుగా ఆన్‌లైన్ అనుమతి పొందాలని నర్సాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ. రంజిత్ కుమార్ సూచించారు. దుర్గామాత పండాళ్ల ఏర్పాటుకు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, నిర్వాహకులు తమ పండాల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అనుమతి ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. పండాల్ ఏర్పాటు చేసే ఖచ్చితమైన ప్రదేశం, నిర్వాహకుల వివరాలు, సంప్రదింపు నంబర్ తదితర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. రోడ్లు, ప్రధాన కూడళ్లు, ఫుట్‌పాత్‌లు, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే ప్రాంతాల్లో పండాళ్లు ఏర్పాటు చేయరాదన్నారు. పండాల్ వద్ద విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, అత్యవసర సమయంలో బయటకు వెళ్లేందుకు మార్గాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే పార్కింగ్, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన పరిమితికి మించి లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టమ్ వినియోగించరాదని, అమలులో ఉన్న శబ్ద నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అసభ్యకరమైన, వివాదాస్పదమైన లేదా ఇతరుల మనోభావాలను దెబ్బతీసే కార్యక్రమాలు, బ్యానర్లు, ప్రదర్శనలకు తావివ్వరాదన్నారు. పండాల్ వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖలకు పండాల్ నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని కోరారు. నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయబోయే అన్ని దుర్గామాత పండాళ్ల వివరాలను 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ముందస్తు అనుమతులు పొందేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ఏ. రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.




# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమన్వయంతో పటిష్ట చర్యలు

మెదక్, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతను మెరుగుపరచడం, జీరో ఫాటాలిటీ లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర డీజీపీ (ఎస్‌ఆర్‌ఓ) ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇళంబరిది పాల్గొని రాష్ట్రంలోని రోడ్డు ప్రమాదాల పరిస్థితి, ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలను గుర్తించి వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రమాదాల నియంత్రణకు పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్, తగిన లైటింగ్‌తో పాటు ఇతర రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి, ప్రమాదాల పునరావృతిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ఇఖుబజ ాఆటవఔ ఫీబీఅఊఆశీఅ--హీ=+ణా=-- ాసాూాఖ వెబ్‌సైట్‌లో రోడ్డు ప్రమాదాలు, బ్లాక్ స్పాట్లు, ప్రమాదాలకు కారణాలు, చేపట్టిన నివారణ చర్యల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు కూడా రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని, అతివేగానికి దూరంగా ఉండాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు జార్జ్, మహేష్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మంచిరేవుల ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.1,108 కోట్లు

**హైదరాబాద్, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** మూసీ నది ఒడ్డున ఉన్న మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.1,108 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. ఆలయాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఆలయ పరిసరాల అభివృద్ధి, సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనతో పాటు మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణకు సంబంధించిన పనులు చేపట్టనున్నట్లు సమాచారం. భవిష్యత్‌లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే




అవకాశం ఉన్న నేపథ్యంలో రవాణా, పార్కింగ్ తదితర సౌకర్యాలను మెరుగుపరిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆధునిక ఆరు వరుసల రహదారి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ రహదారి నిర్మాణంతో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు స్థానికులకు రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది. భారీ స్థాయిలో చేపట్టనున్న అభివృద్ధి పనుల నాణ్యత, పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజినీరింగ్ చీఫ్ ఛైర్మన్‌గా, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ కోఛైర్మన్‌గా వ్యవహరించే విధంగా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు డిజైన్లు, పనుల పురోగతి, సాంకేతిక అంశాలను కమిటీ పర్యవేక్షించనున్నట్లు సమాచారం. అభివృద్ధి పనులు పూర్తయితే మంచిరేవుల ఓంకారేశ్వర ఆలయానికి మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

# దసరాకు 7 వేల ప్రత్యేక బస్సులతో టీజీఎస్‌ఆర్టీసీ సన్నద్ధం

**హైదరాబాద్, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** దసరా (విజయదశమి) పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. దసరా పండుగకు రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో కరీంనగర్ జోన్ పరిధిలో 3,533 ప్రత్యేక బస్సులను నడపనుండగా, ఆదిలాబాద్ రీజియన్‌లో 431, నిజామాబాద్‌లో 719, కరీంనగర్‌లో 1,175, వరంగల్‌లో 530, ఖమ్మంలో 678 బస్సులు అందుబాటులో ఉంచనున్నారు. హైదరాబాద్ జోన్ పరిధిలో 2,155 ప్రత్యేక బస్సులను నడపనుండగా, మహబూబ్‌నగర్‌లో 645, మెదక్‌లో 255, నల్గొండలో 815, రంగారెడ్డిలో 440 బస్సులను ఏర్పాటు చేయనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో దసరా కోసం 1,312 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించారు. ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. అలాగే ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు), ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయినపల్లి, గచ్చిబౌలి తదితర రద్దీ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో పందళ్లు, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రయాణికులకు రవాణా ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. తిరుగు ప్రయాణంలో రద్దీ లేని మార్గాల్లో ఉన్న ప్రత్యేక బస్సులను త్వరితగతిన వెనక్కి రప్పించి, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న రూట్లలో నడిపేలా చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రత్యేక బస్సులకు 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటు ఉన్న నేపథ్యంలో, ఈ దసరాకు నడిపే ప్రత్యేక బస్సుల టికెట్ ధరలను కూడా ఆ మేరకు సవరించినట్లు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయని, ఈ నెల 9, 10, 16, 17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ అధికంగా ఉండే 25, 26 తేదీల్లో మాత్రమే ఈ చార్జీలు అమల్లో ఉంటాయని పేర్కొంది. రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే కొనసాగుతాయని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ




మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్, ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. దసరా ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లను సంప్రదించాలని యాజమాన్యం కోరింది.

# పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష.. రూ.10 వేల జరిమానా

**కొందుర్గ్, అక్టోబర్ 08 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి షాద్‌నగర్ ప్రత్యేక పోక్సో కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. పోలీసుల వివరాల ప్రకారం చౌదరిగూడెం పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 121/2021గా కేసు నమోదు కాగా, ప్రత్యేక సెషన్స్ కేసు నంబర్ 55/2022గా విచారణ జరిగింది. భారతీయ శిక్షాస్మృతిలోని 354-డి, 323, 506 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో చౌదరిగూడెం మండలానికి చెందిన షేక్ అజ్మీర్ (42)ను నిందితుడిగా పేర్కొన్నారు. కేసును విచారించిన షాద్‌నగర్‌లోని ప్రత్యేక




పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్. స్వాతిరెడ్డి తీర్పు వెలువరించారు. ఐపీసీ సెక్షన్ 506, పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12 కింద నిందితుడిని దోషిగా నిర్ధారించిన కోర్టు, ఒక్కో సెక్షన్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు తీర్పులో పేర్కొంది. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా వాదనలు వినిపించగా, దర్యాప్తు అధికారిగా చౌదరిగూడెం ఎస్ఐ కె. వెంకటేశ్వర్లు వ్యవహరించారు. షాద్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగింది. ప్రస్తుతం చౌదరిగూడెం ఎస్ఐగా బి. వెంకటేష్ విధులు నిర్వహిస్తున్నారు. కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ పి. శ్రీశైలం, సమన్స్ విభాగం సిబ్బంది శ్రీ నికేతన్, లైజన్ ఆఫీసర్ సక్రియా నాయక్, మహిళా కానిస్టేబుల్ కే. జ్యోతి తదితరులు కేసు విచారణలో సహకరించారు.

# రాయికోడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కేదార్ నాథ్ పటేల్ నియామకం

- హర్షం వ్యక్తం చేసిన మండల కాంగ్రెస్ నాయకులు




**రాయికోడ్, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** రాయికోడ్ మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీ కేదార్ నాథ్ పటేల్‌కు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేదార్ నాథ్ పటేల్ నాయకత్వంలో రాయికోడ్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే ఇంతకాలం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి, పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ బాలాజీ నర్సింలుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం చేసిన సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తాజా మాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ నూతన అధ్యక్షుడు కేదార్ నాథ్ పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్ నోటీసులు, విచారణలు వేగవంతం చేయాలి

- ప్రతి క్లెయిమ్, అభ్యంతరంపై ఎస్ఓపీ ప్రకారం చర్యలు: కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, అక్టోబర్ 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్--2026 ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి అవసరమైన పత్రాలు, వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. అందిన పత్రాలు, వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి ప్రక్రియలో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో అర్హత కలిగిన ఓటర్లు ఉంటే, నిబంధనల మేరకు అవసరమైన పత్రాలు సమర్పించేలా బూత్ లెవల్ ఏజెంట్లు వారికి సహకరించే విధంగా రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటరు జాబితాలో స్థానం కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సరిహద్దు ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

- రూ.12 లక్షలతో నూతన ఇన్‌పేషెంట్ వార్డు ప్రారంభం
- రూ.5 లక్షల ఐటీడీఏ నిధులతో అత్యాధునిక వైద్య పరికరాల వితరణ
- గిరిజనులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం
- ఐటీడీఏ పీవో రాహుల్

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లోని నిరుపేదలకు సంజీవనిలా మారిన అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మహర్దశ పట్టింది. ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య సేవల విస్తరణలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి (పీవో) బి. రాహుల్ చేతుల మీదుగా రూ. 12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ వార్డు ఘనంగా ప్రారంభమైంది. అదేవిధంగా ఐటీడీఏ ప్రత్యేక నిధుల నుంచి సమకూర్చిన రూ. 5 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణికి లాంఛనంగా అందజేశారు. పేదలకు వైద్య సేవలు మరింత చేరువ : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వార్డు ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఈ ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారని, వారి అవసరాలకు తగినట్లుగా డెంటల్ చైర్స్, రోగుల మంచాలు, ఆక్సిజన్ సిలిండర్లు, ఫీటల్ డాప్లర్ల వంటి కీలక పరికరాలను సమకూర్చినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రోగులకు అంకితభావంతో సేవలు అందించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఆసుపత్రిని మరింత విస్తరించి, అన్ని రంగాల్లో ఆధునికీకరిస్తామని స్పష్టం చేశారు. స్థానికంగా ఉండి ఆదివాసీలకు అండగా నిలవాలి: ఐటీడీఏ పీవో రాహుల్ ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ, ఏజెన్సీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.



కొండకోనల నుంచి వ్యయప్రయాసలకోర్చి వచ్చే ఆదివాసీ గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు తప్పనిసరిగా స్థానికంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఐటీడీఏ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో సైదులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆర్ఎంవో మౌనిక, ఆసుపత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదలైన గిరిజనులకు అన్ని సౌకర్యాలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూముల సర్వే

- అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి గుర్తించిన భూములు పరిశీలన
- ఐటీడీఏ పీవో బి రాహుల్

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన మేరకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని తాసిల్దార్ లతో ఐటీడీఏ పీవో బి రాహుల్ తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం నాడు అశ్వారావుపేట తాసిల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గిరిజన ప్రజలు అత్యధికంగా నివసిస్తున్న నియోజకవర్గ తాసిల్దార్లతో వారి పరిధిలోని మండలాలలో గుర్తించినటువంటి ప్రభుత్వ స్థలాల గురించి మండలాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గంలోని గిరిజనులు అత్యధిక శాతం నివసిస్తున్న మండలాలలోని గ్రామాలలో ఉన్న నిరుపేద గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టడానికి అనువైన ప్రభుత్వ స్థలాలను తాసిల్దార్ ల ద్వారా గుర్తించామని, అవి గ్రామాలకు దగ్గరగా ఉన్నాయా లేవా వాటికి రోడ్డు కనెక్టివిటీ ఉందా లేదా అదేవిధంగా ఎలక్ట్రిక్ లైన్స్ ఉన్నాయా లేవా అని సదుపాయాలు ఉన్నది లేనిది పరిశీలించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తాసిల్దార్లు వారి



పరిధి మండలాలలో గుర్తించినటువంటి స్థలాలను దమ పేట మరియు ములకలపల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో సంబంధిత తాసిల్దారులను తీసుకొని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట తాసిల్దార్ కిషోర్ దమ్మపేట తాసిల్దార్ మురళి అన్నపురెడ్డిపల్లి తాసిల్దార్ స్వర్ణ చంద్రుగొండ తాసిల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ పి వి టి జి అధికారి గన్యా తదితరులు పాల్గొన్నారు.

# సేవకు ప్రతి రూపం అమ్మ నాన్న ఫౌండేషన్

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికురాలీ కుమారుడు, గాయపడిన విద్యార్థికి ఆర్థిక సహాయం రూ 10,000 రూపాయలను అందజేసిన అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ పెరుమాళ్ళ శ్రీనివాస్ మరియు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్. సమాజంలో నిరుపేద బడుగు బలహీన వర్గాలకు తమ వంతు సహాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో అమ్మ నాన్న ఫౌండేషన్ ముందుంటుందని మాజీ మున్సిపల్ పర్సన్ పెరుమళ్ల అన్నపూర్ణ, ఫౌండేషన్ చైర్మన్ పేరుమళ్ళ శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు జెట్టి పద్మ కుమారుడు జెట్టి నరేష్ ఇటీవల జారి పడటంతో మోకాళ్ళలో నరాలు చిట్లి నడవలేని స్థితిలో ఉన్నాడు. ఆపరేషన్ చేసేందుకు రూ లక్షన్నర వరకు కావాల్సి ఉండగా అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ 10వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందజేసి మాట్లాడారు. చదువుకునే విద్యార్థి ప్రమాదానికి గురై మోకాల్లో నరాలు చిట్లి మంచానికి పరిమితం కావడం బాధాకరమన్నారు. నరేష్ మోకాలికి శస్త్ర చికిత్స జరిగి పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పారిశుధ్య కార్మికురాలు ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున నిరుపేద కుటుంబానికి చెందినందున ఎవరైనా ముందుకు వచ్చి ఆపరేషన్ కు కావలసిన సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. సేవకు ప్రతిరూపం అమ్మ నాన్న ఫౌండేషన్ అని తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో



ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

# అండర్-19 రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు దేవి విజ్ఞ ఎంపిక..

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని దేవి విజ్ఞ అండర్--19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల కలిగోట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి తెలిపారు. ఈ నెల 9న హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో దేవి విజ్ఞ పాల్గొననుంది. విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి ఆమెకు అభినందనలు తెలిపారు.



# ఆర్టీసీ గోదావరిఖని డిపో ఎన్నికల ప్రచారంలో ఏ ఐ టి యు సి జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రాజరత్నం



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
ఈరోజు ఆర్టీసీ ఎన్నికల్లో భాగంగా ఉదయం గోదావరిఖని డిపో సందర్శించిన ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు. కందుకూరు రాజరత్నం. ఆర్టీసీ కార్మికులను కలిసి ప్రచారం చేయడం జరిగినది. ఆర్టీసీ కార్మికుల యొక్క స్థితిగతులను డ్యూటీలో విషయంలో. గవర్నమెంటు హాస్పిటల్ సిక్ పే విషయంలో. జీతాల విషయంలో. పిఆర్సి విషయంలో కార్మికులతో చర్చించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం జరిగినది .భవిష్యత్తులో ఆర్టీసీ కార్మికులు ఉండాలన్న అదేవిధంగా ఎలక్ట్రికల్ బస్సులు వస్తున్నాయి కనుక కార్మికులను తగ్గించే ప్రయత్న చేయకూడదు అని వివరించడం జరిగినది .కనుక తొమ్మిదవ తారీకు జరిగే ఎన్నికలలో ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ మజ్దూర్ యూనియన. మరియు. నేషనల్ మజ్దూర్ యూనియన్. ,బలపరిచి న ఐక్య కూటమనే గెలిపించాలని .ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేయడం జరిగినది. ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంటు ప్రెసిడెంటు ఎష్ట్ర బాబు , సెక్రటరీ గుడికందుల శ్రీనివాస్,ఎబ సెక్రటరీ వంగర శ్రీనివాస్ ్,తీ రెడ్డి,అఎబ సెక్రటరీ మాతంగి తిరుపతి

# వన్ టౌన్ సిఐ కరుణాకర్ సేవలు అమోఘం

- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
కొత్తగూడెం :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం వన్ టౌన్ సిఐ గా




కరుణాకర్ విధి నిర్వహణలో అంకిత భావం తో పని చేస్తూ శాంతి భద్రతలను కాపాడుతూ ఈ ప్రాంత వాసులకు అమోఘమైన సేవలు అందించి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు..కరుణాకర్ ఇక్కడి నుంచి బదిలీ పై వెళుతున్న సందర్భంగా బుధవారం ఆయన్ని స్థానిక పోలీసు స్టేషన్ లో శాలువా తో సన్మానించారు...ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అద్భుతమైన పని తీరుతో అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకున్న ఏకైక అధికారి కరుణాకర్ అని ప్రశంసించారు...ముఖ్యంగా ఎన్నికలు,పండుగల ఉత్సవాల సమయంలో సంయమనం పాటిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు కూడా పొందారని గుర్తు చేశారు....ఉద్యోగ రీత్యా కరుణాకర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,బంటు నరేందర్,వంశీ తదితరులు పాల్గొన్నారు

# బిచ్కుంద గోశాలకు గడ్డి కట్టలు అందించిన గ్రామ యువకులు..

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
కామారెడ్డి జిల్లా భిర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కల్లూరు గ్రామానికి చెందిన యువకులు ఎర్ర సాయిలు, మేత్రి కిరణ్‌లు బిచ్కుంద అప్పా గోశాలకు సుమారు రూ. 4 వేల విలువైన గడ్డి కట్టలను అందజేశారు. గోమాతల సంరక్షణలో భాగంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు, గోమాత సేవకులు మేత్రి కిరణ్, లయన్ జోన్ చైర్మన్ సీతలే రమేష్, వేణు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



1

# ఔషధ మొక్కలపై ఐసీఎఫ్ఆర్ఈ విస్తృత సర్వే..



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
గ్రామీణ ప్రాంతాల్లో ఔషధ మొక్కల వినియోగం, సేకరణ విధానాలు, వనమూలికల లభ్యతపై ఐసీఎఫ్ఆర్ఈ--అటవీ జీవవైవిధ్య సంస్థ ఆధ్వర్యంలో విస్తృత సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలో ప్రత్యేక గృహ సర్వే చేపట్టారు.భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన హైదరాబాద్ ఐసీఎఫ్ఆర్ఈ--అటవీ జీవవైవిధ్య సంస్థ శాస్త్రవేత్తలు, సిబ్బంది.. జాతీయ ఔషధ మొక్కల బోర్డు సౌజన్యంతో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రజలు నిత్య జీవితంలో ఉపయోగించే ఔషధ మొక్కలు, అడవుల నుంచి వాటిని సేకరించే విధానాలు, స్థానికంగా లభించే వివిధ రకాల వనమూలికల వివరాలను సేకరిస్తున్నారు.దేశవ్యాప్తంగా, స్థానికంగా ఔషధ మొక్కలకు ఉన్న డిమాండ్, సరఫరాను అంచనా వేయడం ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. సేకరించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఔషధ మొక్కల సంరక్షణతో పాటు గిరిజన, గ్రామీణ ప్రజల ఆర్థిక బలోపేతం, ఉపాధి అవకాశాల మెరుగుదలకు అవసరమైన ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించనుంది.తాడ్వాయి మండలంలో జరిగిన సర్వే కార్యక్రమానికి ఐసీఎఫ్ఆర్ఈ శాస్త్రవేత్త డాక్టర్ పంకజ్ సింగ్ నేతృత్వం వహించారు. సంస్థ ప్రతినిధులు సుమన్, శ్రీనివాస్, నందకుమార్, ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది వినోద్, కళ్యాణి, స్థానిక సర్పంచ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లు దుకాణానికి తాళం..



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో బుధవారం కల్లు ధర పెంపుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కల్లు దుకాణానికి తాళం వేశారు.వ్యాపారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కల్లు సీసా ధరను రూ.10 నుంచి రూ.15కు పెంచడంతో గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులు ఏకమై కల్లు దుకాణాన్ని మూసివేసి తాళం వేశారు. పాత ధరకే కల్లు విక్రయించాలని వారు డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా, బీర్కూర్ మండలంలోని మరో గ్రామంలోనూ ఇటీవల కల్లు ధర పెంపుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన చోటుచేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

# విద్యుత్ కొరతపై రైతుల వినతి..

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



విద్యుత్ కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం నిజాంపేట విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో పంట పొలాలకు సక్రమంగా నీరు అందించలేకపోతున్నామని తెలిపారు. గత రెండు రోజులుగా రాత్రి 12 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరిగేదని, అదే విధంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను కోరారు.

# జర్నలిస్టుల హక్కుల గొంతుకగా టీజేఎంయు

- నేడు టీజేఎంయూ నియోజకవర్గ ప్రథమ మహాసభ
- అశ్వారావుపేట కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో చారిత్రక సదస్సు
- జర్నలిస్టుల సంక్షేమం, భద్రతపై గళమెత్తనున్న తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్
- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, యూనియన్ రాష్ట్ర నాయకత్వం

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
అశ్వారావుపేట : ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ, సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల హక్కుల సాధనకు తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టీజేఎంయు) సమర శంఖం పూరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో గురువారం అక్టోబర్ 8 అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న విలేకరుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణే ప్రధాన అజెండాగా సాగనున్న ఈ మహాసభలు నియోజకవర్గ పాత్రికేయ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాయి. సవాళ్ల సుడిగుండంలో కలం యోధులు ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, పాలకులను ప్రశ్నించే జర్నలిజం నేడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అవినీతి, అక్రమాలను నిగ్గదీస్తున్నారన్న కక్షతో విలేకరులపై అక్రమ పోలీసు కేసులు బనాయించడం, వేధింపులకు గురిచేయడం నిత్యకృత్యమైంది. జాతీయ స్థాయిలో కలం వీరులపై భౌతిక దాడులు, కిరాయి మూకలతో హత్యలు చేయిస్తున్న దారుణ పరిస్థితులు నెలకొన్నాయి.మరోవైపు పాలకులు జర్నలిస్టుల కనీస సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు సైతం అక్రిడేషన్ కార్డులు ఇవ్వకపోవడం, చిన్న-పెద్ద మీడియా సంస్థలనే వివక్షతో అవమానాలకు గురిచేయడం పరిపాటిగా మారింది. దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్న సంఘాలు సైతం క్షేత్రస్థాయి విలేకరుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవడంతో జర్నలిస్టులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఈ గడ్డు పరిస్థితుల్లో విలేకరుల పక్షాన నిలబడి, వారి గొంతుకగా పోరాడేందుకు ఒక బలమైన శక్తిగా 'తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్' ఆవిర్భవించింది.హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకత్వం నేడు జరగనున్న ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా అశ్వారావుపేట శాసనసభ్యులు




జారే ఆదినారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ జూపల్లి శశికళ రమేష్, అశ్వారావుపేట సీఐ పింగళి నాగరాజు రెడ్డి, యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సామల ప్రవీణ్ కుమార్, జి. ఉదయరాఘవేంద్రలు ముఖ్య వక్తలుగా పాల్గొని జర్నలిస్టులకు దిశానిర్దేశం చేయనున్నారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల నుంచి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సదస్సు స్థానిక జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి ఐక్యతకు బలమైన వేదికగా నిలవనుంది.

# ఆర్మూర్ లో చెన్నై షాపింగ్ మాల్ సరికొత్త ఫ్యాషన్ డిజైన్లతో ప్రారంభం వైభవంగా ది చెన్నయ్ షాపింగ్ మాల్

- ప్రారంభించిన యాంకర్ శ్రీముఖి..
- ఆర్మూర్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గోనెలహరి రఘు
- భారీగా తరలివచ్చిన అభిమానులు, కొనుగోలుదారులు

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
ఆర్మూర్ లో చెన్నయ్ షాపింగ్ మాల్ మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ప్రముఖ యాంకర్ శ్రీముఖి మాల్ను ప్రారంభించారు. అనంతరం చెన్నై షాపింగ్ మాల్లోని వివిధ విభాగాలను సందర్శించి వస్త్రాలు, ఫ్యాషన్ ఉత్పత్తులను పరిశీలించారు.



ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండటంతో పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు తరలివచ్చారు. దీంతో మాల్ సందడిగా మారింది. పండుగలు, వివాహాలు, శుభకార్యాలతో పాటు నిత్య అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల వస్త్రాలు, సరికొత్త ఫ్యాషన్ డిజైన్లు అందుబాటులోకి తీసుకురావడంతో వినియోగదారులు ఆసక్తిగా షాపింగ్ చేశారు. కుటుంబ సమేతంగా ఒకే చోట అన్ని రకాల వస్త్రాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో ప్రారంభం రోజే ఆర్మూర్ లో చెన్నై షాపింగ్ మాల్ మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా యాంకర్ శ్రీముఖి మాట్లాడుతూ. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లక్షలాది డిజైన్లతో వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా చెన్నై షాపింగ్ సందర్శించాని కోరారు. ది చెన్నయ్ షాపింగ్ మాల్ వినియోగదారుల నమ్మకానికి చిరునామాగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీముఖిని చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులను శ్రీముఖి ఆప్యాయంగా పలకరిస్తూ, సరికొత్త డిజైన్లతో ఫ్యాషన్ డిజైన్ గా ఆర్మూర్ లో ప్రారంభించడం జరిగింది.

# క్రీడలు యువతకు స్ఫూర్తిదాయకం ఈగ మల్లేశం

- ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో అవసరం
- బ్యాట్ పట్టి పోటీలను ప్రారంభించిన ఈగ మల్లేశం

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డి.సి తండా దుర్గమ్మ గుడి ప్రాంగణంలో సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని తొలి మ్యాచ్‌లో తలపడుతున్న కేశవపురం మరియు ఎన్ ఎస్ తండా క్రీడాకారులకు టాస్ వేసి, స్వయంగా బ్యాట్ పట్టి పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభించిన కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆటలు శారీరక దృఢత్వానికి మరియు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సేవాలాల్ యూత్ సభ్యులు ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు.యువత క్రీడల్లో రాణిస్తూ, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.యువతలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని ఇలాంటి



టోర్నమెంట్లు వారిలోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఎంతగానో తోడ్పడతాయని, క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు.ఆటలు మానసిక ఉల్లాసాన్ని కాకుండా, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని యువత క్రీడలను ఒక అలవాటుగా మార్చుకుని, ఆరోగ్యంగా ముందుకు సాగాలని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు అందిస్తున్న ప్రత్యేక రిజర్వేషన్లను యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి రంగాలలో స్థిరపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కరిమిల్ల సంపత్ రావు, జన్ను రాములు, ప్రభాకర్ , రాము నాయక్, సంతోష్ నాయక్ , రమేష్, నరేష్ మరియు యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.